క్లుప్తంగా

రంజాన్ కోసం ఈద్గా వద్ద ఏర్పాట్లు



ఈద్గాను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు, చైర్మన్ డీవీ

ఇల్లెందు: ఈద్గా వద్ద ప్రతి ఏటా రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈద్గా వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కమిషనర్‌ను ఆదేశించారు. వారి ఆదేశాల ప్రకారం మంగళవారం ఈద్గా వద్ద జరుగుతున్న పనులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ సయ్యద్ ఆజమ్, కోఆప్షన్ సభ్యుడు రబ్బానీ తదితరులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నిర్వాహకులకు తగు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట యూత్ అధ్యక్షుడు మెరుగు కార్తీక్ యాదవ్, ఎర్ర ఈశ్వర్, సతీష్, జవాన్ ప్రకాష్ తదితరులున్నారు.

జేకేఓసీలో డీడీఎంఎస్ పర్యటన



ఓసీని పరిశీలిస్తున్న కమలేష్ కుమార్‌వర్మ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకేఓసీ-5 లో డీడీఎంఎస్(మైనింగ్) కమలేష్ కుమార్ వర్మ పర్యటించారు. మంగళవారం గనిని సందర్శించిన ఆయన బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ విభాగాలను తనిఖీ చేశారు. గని అధికారులు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ అధికారి పంజాల శ్రీనివాసు, ఏజెంటు బొల్లం వెంకటేశ్వర్లు, మేనేజర్ పూర్ణచందర్, ఇంజనీర్ చిన్నయ్య, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, నర్సింహారావు, సర్వే అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ



చీరలు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

ఇల్లెందు: పట్టణంలోని 4వ వార్డులో స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఖాజా గౌస్‌మొయినుద్దీన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మంగళవారం తన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చీమల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా చీరలు అందజేశారు. కార్యక్రమంలో స్వామాట్, డి.డానియేల్, పి.సైదులు, అక్తర్, ఎట్టి హరికృష్ణ, అఫ్సర్, నిజాం, సైదులు, నయీం, రాజా తదితరులు పాల్గొన్నారు.

పగలంతా విద్యుత్ వెలుగులు



పగటిపూట వెలుగుతున్న వీధి దీపం

ఇల్లెందురూరల్: మిట్టపల్లి గ్రామపంచాయతీలో ఒకటి, రెండు చోట్ల కాదు.. పంచాయతీ వ్యాప్తంగా రాత్రి పూట వెలగాల్సిన వీధి లైట్లు మంగళవారం పగలంతా వెలుగుతూనే ఉన్నాయి. స్వచ్ఛ భారత్ మిషన్-2 సర్వేలో భాగంగా పంచాయతీలో పర్యటించిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ చిరంజీవి గ్రామంలో పర్యటిస్తున్నప్పటికీ వాటిని ఆర్పేవారు లేరు. గ్రామపంచాయతీ సిబ్బంది సైతం తమ నిర్లక్ష్యాన్ని పొద్దంతా ప్రదర్శించారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీధి దీపాలు రాత్రి పూట మాత్రమే వెలిగేలా జాగ్రత్తలు తీసుకొని విద్యుత్ దుబారాను అరికట్టడంతోపాటు విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

నిధుల దుర్వినియోగం

- నిరుపయోగంగా పంటకాల్వ నిర్మాణం
- అధికారుల అనాలోచిత నిర్ణయంతో ఇబ్బంది పడుతున్న రైతులు
- రూ.3.3కోట్ల ప్రభుత్వ ధనం వృథా



నాగారం కాలనీ వద్ద అసంపూర్తిగా బూడిద కాల్వ

పాల్వంచరూరల్: అధికారుల అనాలోచిత నిర్ణయంతో నిర్మించిన పంటకాల్వ రైతులకు ఉపయోగపడకుండా పోయింది. రూ.కోట్ల ప్రభుత్వ ధనం బూడిదలో పోసినట్లయింది. రైతుల పంటలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో రూ.3.3కోట్ల వ్యయంతో బూడిదవాగు నీటిని మళ్లించేందుకు 2007లో అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. కేటీపీఎస్ కర్మాగారం బూడిద చెరువు నుంచి వృథాగా దిగువకు ప్రవహిస్తున్న బూడిద కాల్వ నీటిని సూరారం వద్ద నిల్వ చేసి అక్కడి నుంచి పంటకాల్వ తీసి 14 వందల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిధులు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సూరారం వద్ద బూడిద వాగుకు కట్ట నిర్మించి అక్కడి నుంచి జగన్నాథపురం మీదుగా నాగారం కాలనీ ఆర్టీఏ చెక్‌పోస్టు నాగారం వరకు సుమారు తొమ్మిది కిలోమీటర్ల పొడవున కాల్వ నిర్మాణం చేశారు. సంగం వరకు కాల్వ నిర్మాణం చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో 2008లో పనులు నిలిచిపోయాయి. అదేసమయంలో జగన్నాథపురం నుంచి నాగారం గ్రామం వరకు 40 మీటర్ల వెడల్పుతో తారురోడ్డును నిర్మించారు. ఈ క్రమంలో పంటకాలువ వద్ద కల్వర్టును లేకుండానే కాల్వను పూడ్చి రోడ్డు నిర్మించారు.

60 ఎకరాల భూసేకరణ..

బూడిద కాలువ నిర్మాణం కోసం అప్పటి ఇరిగేషన్ శాఖ ద్వారా జగన్నాథపురం, నాగారం పరిసర ప్రాంతాల్లో ఎకరానికి రూ.1.45 లక్షల చొప్పున 67మంది రైతులకు పంట నష్టపరిహారం చెల్లించి 60 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 40 ఎకరాలు భూ సేకరణ జరగాల్సి ఉండగా పనులు ముందుకు సాగలేదు. అప్పటికే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయాయి. బూడిద కాల్వ నిర్మాణం పూర్తయితే వానకాలం, వేసవికాలంలో రెండుపంటలకు సాగునీరు అందుతుందని రైతులు సంతోషించారు. ఈ క్రమంలో రైతుల ఆశలు అడియాశలయ్యాయి.

ఇప్పటి వరకు చేసిన పనులు వృథా..

బూడిద కాల్వ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు



రోడ్డు నిర్మాణం కోసం కాలువను పూడ్చిన దృశ్యం

చేసిన రూ.3.3 కోట్ల ధనం బూడిద వాగులో పోసినట్లుగా వృథా అయ్యాయి. పంట కాల్వ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో నేడు కాల్వ నిరుపయోగంగా మారింది. సాగునీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మిగిలిన కాల్వ నిర్మాణాన్ని పూర్తి చేసి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మిగిలిన పనులు పూర్తి చేయాలి



నాలుగైదు గ్రామాల రైతుల పంటల సాగుకు ఉపయోగకరమైన బూడిద కాల్వ అసంపూర్తిగా నిలిపివేయడంతో పంటలకు సాగునీరు లేక రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిలిచిపోయిన కాల్వ పనులను పూర్తి చేయించి సాగునీరు అందించాలి. – సత్యనారాయణ, రైతు

వర్షాధారమే దిక్కు..



బూడిద కాల్వ నిర్మాణం పూర్తయితే రెండు పంటలకు సాగునీరు అందుతుందని సంతోషపడ్డాం. కానీ పనులు నిలిచిపోవడంతో వర్షాధారంపైనే ఏడాదికి ఒక పంటను మాత్రమే పండిస్తున్నాం. నిధులు మంజూరు చేసి కాల్వ పూర్తి చేయాలి. – సపావత్ వెంకటరమణ, రైతు

భూసేకరణలో జాప్యం జరిగింది



బూడిద కాల్వ పనులు సగం పూర్తి చేశాం. భూసేకరణ పూర్తిస్థాయిలో జరగకపోవడంతో పనులు పూర్తి కాలేదు. 1400 ఎకరాలకు సాగునీరు అందించేందుకు నాగారం లిఫ్ట్ నిర్మాణం చేపట్టాం. పనులు పూర్తయితే పంటలకు సాగునీరు అందుతుంది. – బి.అర్జున్, జలవనరులశాఖ ఈఈ

మలేరియా గుర్తింపునకు గ్రామాల్లో సర్వే



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

టేకులపల్లి: మలేరియా గుర్తింపునకు గ్రామాల్లో ప్రత్యేక సర్వే కార్యక్రమం జరుగుతోంది. ఈ మేరకు మంగళవారం నాగారంజోగు, సిద్ధారం, మొట్లగూడెం గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షించారు. ఈ సందర్భంగా ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ... జిల్లా వ్యాపితంగా మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్న 173 గ్రామాలను గుర్తించడం జరిగిందని, టేకులపల్లిలో మూడు గ్రామాలు ఉన్నాట్లు తెలిపారు. రక్త నమూనాల్లో పారాసైట్ ఉన్నట్లుగా గుర్తిస్తే వెంటనే ఆ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతోపాటు నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు దనసరి రాంబాబు, రమేష్‌బాబు, ఏఎన్‌ఎంలు మానస, అరుణాదేవి, ఆశా కార్యకర్తలు రమాదేవి, సుశీల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

పాల్వంచరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని, లేనిపక్షంలో ఈనెల 28 నుంచి సమ్మె చేస్తామని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ జి.రవీంద్రప్రసాద్‌కు మంగళవారం నోటీసు అందజేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు నాలుగు సంవత్సరాల శిక్షణ కాలం పూర్తయిన తరువాత ప్రభుత్వం నుంచి ఇంతవరకు స్పందన లేదన్నారు. ఈ మేరకు టీపీఎస్‌ఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని పేర్కొన్నారు. రణధీర్, రాజశేఖర్, అనిల్, నాగిరెడ్డి, రవి, కార్తీక్, రమేష్, జ్యోతిరెడ్డి, మౌనిక, మంగ పాల్గొన్నారు.

'స్వచ్ఛ్ భారత్' ఇంటింటి సర్వే

ఇల్లెందురూరల్: స్వచ్ఛ భారత్ మిషన్-2లో భాగంగా మండలంలోని మిట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం ఇంటింటి సర్వే చేపట్టారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిని 12టీంలుగా విభజించి వార్డుల వారీగా సర్వే నిర్వహించారు. గ్రామంలోని ప్రతిఇంటికి వెళ్లి వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, మురుగునీటి ప్రవాహం, చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులు వంటి అంశాలపై వివరాలు సేకరించారు. అనంతరం సర్వే బృందాలతో ఎంపీఓ చిరంజీవి సమావేశమయ్యారు. గ్రామపంచాయతీ సమగ్ర స్వరూపాన్ని వివరించేలా నమూనా చిత్రపటాన్ని సిద్ధం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనుల రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి కె.రాజీవ్‌కుమార్ కార్యదర్శులను హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పల్లె ప్రగతి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యను పరిష్కరించుకోవాలని ఆదేశించారు. వాటర్ ట్యాంక్‌లు, డ్రెయినేజీలు శుభ్రం చేయాలని, ప్రతిరోజూ ఇళ్లల్లో తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలకు నీరు పెట్టాలని, పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. మండల పంచాయతీ అధికారి బొగ్గ నారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎండీ హామీని నిలబెట్టుకోవాలి

పాల్వంచ: కేటీపీఎస్ 6వ దశ కార్మికులకు ఉద్యోగాలు కల్పిస్తామని రాత పూర్వకంగా సీఎండీ హామీ ఇచ్చి విస్మరించారని, తక్షణం మాట నిలబెట్టుకుని న్యాయం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేశ్ అన్నారు. స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో 6వ దశ నిర్మాణ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలకు మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కామేశ్ మాట్లాడుతూ.. సుమారు 400 మంది కార్మికులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా పనిచేశారని, ఈ క్రమంలో అంగవైకల్యానికి సైతం గురైనట్లు చెప్పారు. అలాంటి వారికి ఆర్టిజన్‌లుగా యాజమాన్యం తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించాలని, లేని పక్షంలో ఆందోళనలకు పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నూకల రంగారావు, మురళీ, మనోహర్, ప్రవీణ్‌కుమార్, ఆనందరావు, రవూఫ్, శ్రీనివాసరావు, రమేష్, వన్నాపురం శ్రీనివాసరావు, కృష్ణ కిశోర్, నాగరాజు, నాగేశ్వరరావు, కనకయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే



పాల్వంచరూరల్: నిరసన తెలుపుతున్న వీఓఏలు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జరిగే వీఓఏల నిరవధిక సమ్మెకు పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.వీరన్న అన్నారు. జిల్లా కేంద్రం కొత్తగూడెంలో రెండో రోజు నిర్వహిస్తున్న వీఓఏల దీక్షా శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వీఓఏల సమ్మె ఉధృతంగా జరుగుతోందని, ఇది ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. వీఓఏలు నెల రోజులుగా దశలవారీ ఆందోళనలో భాగంగా ముందుగా సెర్ప్ సీఈఓలకు వినతిపత్రాలు అందజేయటం జరిగిందని, మార్చి 16, 17, 18 తేదీలలో టోకెన్ సమ్మె, ఏప్రిల్ రెండో తేదీన ఆన్‌లైన్‌లో సేవలు బంద్ వంటి నిరసన కార్యక్రమాలు చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రేష్మ, మాధవి, మునీషా, స్వరూప, రాజమణి, అరుణ, పద్మావతి, జహిదా, సఫియా, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ ఐకేపీ వీఓఏలు చేపట్టిన రిలే నిరహార దీక్షల్లో భాగంగా రెండోరోజు మంగళవారం మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి కె.సత్య మాట్లాడుతూ.. వీఓఏలకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు నేరవేర్చకపోగా అదనంగా పనిభారం మోపిందన్నారు. కనీసం రూ.26వేల వేతనాలు చెల్లించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ట్యాబ్‌లు ఇవ్వాలని గ్రేడింగ్ పద్ధతిని రద్దు చేయాలని, అర్హులైన వీఓఏలను సీసీలుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. వి.అనురాధ, ఎన్.రమేష్, రమాదేవి, ఉమ, కృష్ణవేణి, సుజాత, రోజాకుమారి, జయ, సుమలత పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: సెర్ప్‌లో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఐద్వా మండల కార్యదర్శి ఆలేటి సంధ్య డిమాండ్ చేశారు. తమ విధులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు నిర్వహిస్తున్న నిరసన దీక్షలు మంగళవారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ.. వీఓఏలు ప్రభుత్వానికి మహిళా సంఘాల మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరుస్తున్నారని గుర్తు చేశారు. వారికి కనీస వేతనం కూడా ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకోవడం సరైంది కాదన్నారు. ఆన్‌లైన్ గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వీఓఏలకు మెరుగైన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. నబీ, తాళ్లూరి కృష్ణ, నవ్య, పాపారావు, మోతీలాల్, వసంతరావు, నీలాబాయి, ప్రమీల, సుల్తానా, పృథ్వీ, ఈసం వెంకటమ్మ, రాంబాయి, మరియా, ఫాతిమా పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కొత్తగూడెంఅర్బన్: ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: ముస్లిం, మైనార్టీ అభివృద్ధికి బీఆర్‌ఎస్ పెద్దపీట వేస్తుందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో ముస్లింలకు ఎమ్మెల్యే వనమా ఇఫ్తార్ విందు ఇచ్చారు. తొలుత వారితో కలిసి ప్రార్థనలు చేసి, ముస్లింలకు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఇఫ్తార్ విందులో వనమా రాఘవేందర్‌రావు, సింగరేణి డైరెక్టర్ బసవయ్య, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, కంచర్ల చంద్రశేఖరరావు, కాపు సీతామాలక్ష్మి, బాదాదత్ శాంతి, దామోదర్ యాదవ్, కాసుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: అన్ని వర్గాల వారి సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. రంజాన్ కానుకగా ప్రభుత్వం అందజేసిన రంజాన్ తోఫాను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని మతాల వారిని సమానంగా చూస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారి అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని ముస్లింలకు రంజాన్ తోఫాను పంపిణీ చేయడంతో పాటు ఆర్థిక సాయం కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. పదవి ఉన్నా లేకున్నా 40 ఏళ్లుగా ప్రజల మధ్యే ఉంటున్నానని తెలిపారు. ఇఫ్తార్ నిమిత్తం రూ.25 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి, సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, శివాలయం చైర్మన్ అన్నపురెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీలు శోభారాణి, మానస తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: రంజాన్ పండుగ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ముస్లింలకు రంజాన్ తోఫా (కానుకలు)లను పంపిణీ చేశారు. జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, తహసీల్దార్ శారద మండలంలోని 180 ముస్లిం కుటుంబాలకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, గిర్దావర్ ఎం.తిరుపతిరావు, జూలూరుపాడు ఎంపీటీసీ సభ్యుడు పెండ్యాల రాజశేఖర్, సర్పంచ్ గుండెపిన్ని విజయ, జామా మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎస్కే సిద్దిక్, సభ్యులు జానీమియా, ఎస్కే బాబు, మహబూబ్, ఖరీం, యూసఫ్, షఫీ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులతో సోదరభావం..



కొత్తగూడెంరూరల్: ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న నాగా సీతారాములు

కొత్తగూడెంరూరల్: రంజాన్ పవిత్ర మాసంలో ఇఫ్తార్ విందు హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు అన్నారు. మంగళవారం కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరంలోని జామియా మసీద్‌లో ముస్లింలతో పాటు ఇఫ్తార్ విందులో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ.. 30 రోజులపాటు ముస్లింలు కఠినమైన ఉపవాస దీక్ష చేపడతారని, ఉపవాస దీక్ష ముగిసే సమయం వరకు నిష్టగా ఉంటూ చేసే ప్రార్థనల వల్ల సమస్త మానవాళికి శాంతి చేకూరుతుందన్నారు. రంజాన్ పండుగను ముస్లింలు ఆనందోత్సవాలతో జరుపుకోవాలన్నారు.

టీటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

కొత్తగూడెంఅర్బన్: టీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లోని శివశివాని పాఠశాలలో రాష్ట్ర అధ్యక్షుడు మాలోత్ రామారావు సమక్షంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా భూక్యా మోహన్ రాథోడ్, ప్రధాన కార్యదర్శిగా తేజావత్ రాము నాయక్, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా జి. మోహన్‌లాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సభావత్ బాలకృష్ణ చౌహాన్, అసోసియేట్ అధ్యక్షుడిగా బి. లోకేష్, జిల్లా ప్రచార కార్యదర్శిగా బి.రతన్, జిల్లా ఉపాధ్యక్షుడిగా రాందాస్, జే.శ్రీను, రామచందర్, బాబూలాల్ కోశాధికారిగా బి.రవి, జిల్లా కార్యదర్శులుగా హరిలాల్, వీరు, బాలు, వీరన్న, రాందాస్, చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సహాధ్యక్షుడు బానోతు రాములు నాయక్, కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా భూక్యా మోహన్ రాథోడ్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, ఏహెచ్‌ఆర్‌ఏ, ఎస్సీఏల జీఓలను తక్షణమే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ఏజెన్సీలోని జీఓ నంబర్ 3కి అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టబద్ధత కల్పించాలని కోరారు. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్‌కు లోబడి ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు పూర్తిగా గిరిజనులకు చెందేటట్టుగా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కూనారం భూములను సర్వే చేయించండి



డీఎఫ్‌ఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ గిరిజనులు

సింగరేణి(కొత్తగూడెం): కూనారం గ్రామంలో వ్యవసాయ సాగు భూములను అటవీ, రెవెన్యూ శాఖలచే సర్వే చేయించి హద్దులు చూపాలని మంగళవారం ఫారెస్ట్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆదివాసీ గిరిజనులు ఆందోళన చేసి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిపల్లి జెడ్పీటీసీ మేరెడ్డి వసంత, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ నాయకులు మాచర్ల సత్యం మాట్లాడారు. లక్ష్మీదేవిపల్లి మండలం కూనారం ఆదివాసీ గిరిజనులు 30 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలోని భూములను సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న క్రమంలో అటవీ అధికారులు వచ్చి భూమిపై వచ్చి ప్లాంటేషన్ వేస్తామంటూ బెదిరించి గిరిజనుల భూములను బలవంతంగా ఆక్రమించుకున్నట్లు చెప్పారు. గిరిజనులు కొంత భాగం సాగు చేసుకుంటున్న క్రమంలో అధికారులు సర్వే చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రెండు శాఖల అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జాటోత్ కృష్ణ, పాయం వెంకయ్య, కవులూరి సమ్మయ్య, పూణెం నారాయణ, పాయం సుజాత, కవులూరి భూషమ్మ, గుగ్గిల నరసింహా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే ఉపాధ్యాయుల లక్ష్యం




మాట్లాడుతున్న అమెరికన్ వాసి జాన్

ఇల్లెందురూరల్: విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉండాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు పనిచేస్తారని, వారి పట్ల విద్యార్థులు గౌరవభావంతో ఉండాలని అమెరికావాసులు జాన్, యోనా, కెత్లిన్, పేజ్ అన్నారు. ముకుందాపురం గ్రామంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటైన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. డెస్టినీ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా విద్యార్థుల కెరీర్ గురించి వారు మాట్లాడారు. విద్యార్థులు తప్పు చేస్తే ఉపాధ్యాయులు దండించేది పాఠశాల స్థాయిలోనేనని, అది తమ భవిష్యత్ కోసమేనన్నారు. పాఠశాల స్థాయి తరువాత పైచదువుల్లో ఏ తప్పుచేసినా దండించే పరిస్థితి ఉండదన్నారు. ఆ సమయంలో జీవితంలో ఎలా ఎదగాలన్నది విద్యార్థుల చేతుల్లోనే ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమలలో ప్రిన్సిపాల్ తుమ్మలపల్లి రమాదేవి, కరస్పాండెంట్ ప్రసాద్, ఉపాధ్యాయులు ఆనంద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఎప్పుడు ప్రారంభిస్తారో?



టేకులపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో విద్య, వ్యవసాయ, ఈజీఎస్, ఐకేపీ, పీఆర్ ఏఈ, మండల పరిషత్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ మహిళా ఉద్యోగులకు కనీసం టాయిలెట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో 'సాక్షి'లో పలుమార్లు ప్రత్యేక వార్తా కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు మండల పరిషత్ నిధులు రూ.2.83లక్షలతో మహిళల కోసం మరుగుదొడ్లు నిర్మించారు. దోర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. నిధులు లేవా లేదంటే ముహూర్తం కుదరడం లేదా అర్థం కావడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి టాయిలెట్లను వెంటనే వినియోగంలోకి తేవాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. – టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : బాలరాజు, ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్ నంబర్ : 9553230015